క్లుప్తంగా

మూల్ నివాసి సంఘ్ నూతన కార్యవర్గం



వాకాడు: మండలంలోని తూపిలి గ్రామంలో ఆదివారం మండల మూల్ నివాసి సంఘ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆ సంఘ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కే మురళి అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా దారా బలరామయ్య, ఉపాధ్యక్షులుగా కే జనార్దన్, నరసింహులు, సభ్యులుగా చెంచుకృష్ణ, భాస్కర్, వెంకటరమణ, పోలయ్య, బాబులు, మోహన్, కోటయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు పేర్నాటి రామకృష్ణ, కె భాస్కర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

దుస్తులు, దుప్పట్ల పంపిణీ



దుస్తులు, దుప్పట్లు అందజేస్తున్న దాతలు

గూడూరు: పట్టణంలోని శ్రీ సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు రాజినేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ఆదివారం దుస్తులు, దుప్పట్లతోపాటు పిండి వంటలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు వ్యవస్థాపకుడు శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ ఏటా సంక్రాంతి సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుస్తులు, ఇతర సామగ్రితోపాటు స్వీట్లు కూడా అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ శిరీష, ట్రస్టు కార్యదర్శి రామయ్య నాయుడు, భాస్కర్, బాబు, పవన్, ఆశ్రమ నిర్వాహకురాలు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల పంపిణీ

చిల్లకూరు: తీర ప్రాంతంలోని ఏరూరులో ఉన్న సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో ఈ నెల ఒకటో తేదీన నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి పెద్ద మంచాల లలితమ్మ, దినకర్, పనత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చేయూతే లక్ష్యం

సైదాపురం: అందరి అభ్యున్నతికి చేయూత అందించడమే స్నేహం ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని ఆ ఫౌండేషన్ కన్వీనర్ మన్నెం శ్రీనివాసులు పేర్కొన్నారు. సైదాపురంలో రెండు రోజులుగా జరిగిన క్రీడాపోటీల ముగింపు సమావేశం నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

నేదురుమల్లి రాక నేడు

వెంకటగిరి: వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మంగళవారం వెంకటగిరి రానున్నట్లు ఆర్టీసీ రీజినల్ మాజీ చైర్మన్ చెలికం శంకరరెడ్డి, నేతలు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పి దశరథరామిరెడ్డి, పులి ప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం 4.00 గంటల నుంచి స్థానిక నేదురుమల్లి నివాసంలో ఆయన పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటారని తెలియజేశారు. అలాగే వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యక్రమాల నిర్వహణ కోసం నేదురుమల్లి ఇంటి ఆవరణలో క్యాంప్ కార్యాలయ నిర్మాణానికి బుధవారం ఉదయం 9.30 గంటలకు ఆయన భూమిపూజ చేస్తారన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి వైఎస్సార్ జిల్లా బద్వేల్‌కు చెందిన పోట్టేళ్ల సుబ్రమణ్యం, ఉమాదేవి దంపతులు ఆదివారం లక్ష ఒక్క రూపాయి నగదు విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని దేవస్థానం ఏసీ వెంకటసుబ్బయ్యకు అందజేశారు. దాతలకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు, శ్రీవారి చిత్రపటం అందజేశారు.

వ్యక్తిపై దాడి



గాయపడిన పెంచలయ్య

ఓజిలి: తాగిన మైకంలో దాడి చేయడంతో పెంచలయ్య అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కురుగొండలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు కథనం మేరకు.. మానమాల గ్రామంలోని అయ్యప్పస్వామి మందిరానికి విద్యుత్ దీపాలు అలంకరించారు. ఈ క్రమంలో మందిరంలో కాలిపోయిన స్పీకర్లును పెంచలయ్య ఇంటికి తీసుకుని వెళుతుండగా కురుగొండ తిప్పపై ఉన్న దిలీప్, రాజేష్, తరుణ్, చరణ్ అనే నలుగురు వ్యక్తులు మద్యం సేవించి స్పీకర్లు కావాలని ఫోన్ చేశారు. తమ వద్ద స్పీకర్లు లేవని చెప్పడంతో ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తుండగా అడ్డగించుకుని దాడి చేశారు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పోయిరావమ్మా.. గౌరమ్మా!





వెంకటగిరిలో గౌరమ్మను నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళుతున్న మహిళలు, గొబ్బి తట్టి, పాటలు పాడుతున్న మహిళలు

వెంకటగిరి: మహిళలు ఉత్సాహంగా నిర్వహించే గౌరమ్మ నిమజ్జనోత్సవం సోమవారం కాశీపేట సమీపంలోని కైవల్యానదిలో వేడుకగా నిర్వహించారు. వెళ్లిరావమ్మ.. గౌరమ్మా అంటూ ఆయా ప్రాంతాల నుండి మహిళలు గౌరమ్మలను తీసుకువచ్చి కైవల్యా నదిలో నిమజ్జనం చేసి వీడ్కోలు పలికారు. కాశీతోటలో పలువురు చిన్నా, పెద్దా తేడా లేకుండా గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. వనభోజనాలు చేసి ఆటపాటలతో పండుగను జరుపుకున్నారు.

చింతాలమ్మ పొంగళ్లు

ఓజిలి: మండలంలోని చింతాలమ్మవారికి గ్రామస్తులు సోమవారం పొంగళ్లు పెట్టారు. పొంగళ్లు ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లారు. ఆలయం వద్ద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పొంగళ్లు వండి, నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముపాళ్ల మాధవీలత, మాజీ సర్పంచ్ కొండూరు సురేష్‌రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కొండూరు వామన రాజు, ముపాళ్ల మోహన్‌రాజు, ముపాళ్ల ప్రతీప్‌రాజు పాల్గొన్నారు. అలాగే సుగుటూరులో చింతాలమ్మ అమ్మవారికి గ్రామస్తులు పొంగళ్లు పెట్టారు. వైఎస్ ఎంపీపీ ప్రసాద్‌నాయుడు, సర్పంచ్ వసంతకుమారి, నాయకులు పంజాం ప్రతాప్‌కుమార్, సుబ్బనాయుడు, సీవీ, జయరామయ్య పాల్గొన్నారు.



చిల్లకూరు: పూజలు చేస్తున్న పాడి రైతులు

దగ్గవోలులో..

దక్కిలి: మండలంలోని దగ్గవోలులో గ్రామదేవత తాళమ్మతల్లికి సోమవారం గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. అలాగే పోతురాజు, పరుశు రామయ్య ప్రత్యేక పూజలు చేశారు.

భక్తి శ్రద్ధలతో కనుమ పండుగ

చిల్లకూరు: మండల ప్రజలు సోమవారం కనుమ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పాడి రైతులు పశు సంపద వృద్ధి కోసం బొమ్మరిల్లు కట్టి, గౌరమ్మను కొలువుదీర్చి, పొంగళ్లు పెట్టి, గోమాతలకు పూజలు చేశారు. అనంతరం పశువులను బొమ్మరిల్లు చుట్టు నడిపించారు.



ఓజిలి: చింతాలమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు



దక్కిలి: పొంగళ్లు పొంగిస్తున్న భక్తులు

మది.. మది నిండా సంక్రాంతి

సైదాపురం: సంక్రాంతి శోభతో మండలంలోని పల్లెలు కళకళలాడాయి. శనివారం నుంచి సోమవారం వరకు తెలుగు సంస్కృతి, సంప్రదాయలను ప్రతిబింబించే సంక్రాంతిని ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్ది, గొబ్బెమ్మలు పెట్టి వేడుకలు జరుపుకున్నారు. కొడుకులు, కోడళ్లు, ఆడపడుచులు, అల్లుళ్ల రాకతో పల్లె సీమలు కొత్తశోభను సంతరించుకున్నాయి. పెద్ద పండుగ సందర్భంగా స్వర్గస్తులైన తమ కుటుంబ సభ్యులకు ఇంటిల్లిపాది భక్తి శ్రద్ధలతో దుస్తులు పెట్టుకుని మొక్కుకున్నారు. మహిళలంతా గొబ్బి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అలాగే మండలంలో సోమవారం పాడి రైతులు ఘనంగా పశువుల పండుగను జరుపుకున్నారు. పశువుల కొమ్ములకు రంగులు వేసి, పూజించారు.

వేడుకగా సంక్రాంతి సంబరాలు

నాయుడుపేటటౌన్: సంక్రాంతి పండుగ సంబరాలను వేడుకగా జరుపుకున్నారు. ఆదివారం పెద్దల పండుగను అనేక మంది భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల వద్దకు వెళ్లి పూజలు చేశారు. సోమవారం కనుమ పండుగను కోలాహలంగా జరుపుకున్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆయన అల్లుడు శ్రావణ్ కుమార్‌ను నెల్లూరులో ఆదివారం పలువురు అధికారులు, నాయకులు కలసి సంక్రాంతి శుభాకాంక్షాలు తెలిపారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నియోజవర్గ ఇన్‌చార్జి సిద్ధయ్య, ప్రభుత్వాస్ప అభివృద్ధి కమిటీ సభ్యులు దొంతాల రాజశేఖరరెడ్డి వేర్వేరుగా శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని పుంగనూరులో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి కలసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

డల్లాస్‌లో సంక్రాంతి

అమెరికాలోని డల్లాస్‌లో ప్రవాసాంధ్రలు సంక్రాంతి వేడుకలను జరుపుకున్నట్లు స్థానిక ప్రవాస భారతీయులు యువ కన్వీనర్ గోపిరెడ్డి తెలిపారు.

పల్లె ఆటలకు ప్రాణం పోయాలి

గూడూరు: అంతరించిపోతున్న గ్రామీణ క్రీడలకు ప్రాణం పోయాలని, నేటి తరాలకు గుర్తు చేసేలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించాలని యోగా మాస్టర్ కట్టా మురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడలైన కర్రాబిళ్ల, బొంగరాలు, గోళిలాట తదితర క్రీడా పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మురళీకృష్ణ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించకపోతే, రాబోయే రోజుల్లో గ్రామీణ క్రీడలున్నాయని కూడా తెలియకుండా అంతరించిపోతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కే చంద్రశేఖర్, కే శ్రీనివాసులు, సుబ్రమణ్యం, పీడీ కరీముల్లా, రాము, శ్రీనివాసులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న మురళీకృష్ణ

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతే ధ్యేయం

గూడూరు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎస్‌వీ రమణయ్య పేర్కొన్నారు. నూతన సభ్యుడిగా ఎంపికైన ఆయన సోమవారం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావును కలిసి, కృతజ్ఞతలు తెలియజేసి, ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన టవర్‌క్లాక్ సెంటర్‌లోని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాతమ్మగుడి అధ్యక్షుడు గూడూరు గోపాల్, కే శ్రీనివాసులు, కే సురేంద్ర పాల్గొన్నారు.

పేదలకు సాయంతోనే సంతృప్తి

పెళ్లకూరు: పండుగ రోజుల్లో పేదలకు తమవంతు సాయం చేయడంలో సంతృప్తి కలుగుతుందని కేఆర్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు వేలూరు కళ్యాణ్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదివారం గ్రామంలోని దళితకాలనీ, గిరిజన కాలనీతో పాటు పరిసర గ్రామాల్లోని వెయ్యి మందికిపైగా నిరుపేదలకు చీరలు, దుప్పట్లు, లుంగీలు, టవళ్లు, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే పేదలకు దుస్తులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేలూరు మురళీకృష్ణారెడ్డి, డాక్టర్ గడ్డం సునీల్‌రెడ్డి, వేలూరు హరిబాబు రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న కళ్యాణ్‌రెడ్డి

చందనముడిలో ముగ్గుల పోటీలు



ముగ్గును పరిశీలిస్తున్న శ్రీనివాసులురెడ్డి

దొరవారిసత్రం: చందనముడి గ్రామంలో ఆదివారం సంక్రాంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఈ.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలకు నిర్వహించారు. ముగ్గులు ఎంపిక చేసి బహుమతులను అందజేశారు.

ఓడూరుకు ఫోన్‌లో సీఎం పరామర్శ

నాయుడుపేట: మున్సిపాలిటీలోని రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్‌రెడ్డిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఓడూరు సుందరరామిరెడ్డి మరణించిన సమాచారం తెలిసిన సీఎం ఆయన కుమారుడిని ఓదార్చారు. సుందరరామిరెడ్డి ఆరోగ్య పరిస్థితి ఏమిటి, ఎలా మరణించారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే నేరుగా కలుద్దామని చెప్పారు.

నేదురుమల్లి పరామర్శ

వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నాయుడుపేటలోని ఓడూరు గిరిధర్‌రెడ్డిని ఆయన నివాసానికి వెళ్లి, పరామర్శించారు. ఓడూరు సుందరరామిరెడ్డి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులైన ఓడూరు ముద్దుకృష్ణారెడ్డి, సోదరుడు మురళీధర్‌రెడ్డిని పరామర్శించారు. పార్టీకి సుందరరామిరెడ్డి సేవలు మరువలేనివన్నారు. ఆయన వెంట నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, తోట గణేష్‌రెడ్డి, షేక్ యస్దానీబాషా, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు కట్టా సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ, కట్టా కమలాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



గిరిధర్‌రెడ్డిని పరామర్శిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

క్యాలండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బుల్లితెర నటి, నిర్వాహకులు

రాపూరు: మండలంలోని వేపినాపి వద్ద ఉన్న పోతుకొండ అంకాళపరమేశ్వరి ఆలయంలో నూతన సంవత్సర క్యాలండర్‌ను సోమవారం ఆలయ నిర్వాహకులు ఆవిష్కరించారు. వీటిని భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీవీ సీరియల్ కార్తీక దీపం ఫేమ్ సౌర్య, ఆలయ నిర్వాహకులు పాపకన్ను వేణుగోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పక్షుల కేంద్రంలో సందడి



పులికాట్ సరస్సులో ఉన్న గూడబాతులు

దొరవారిసత్రం: సంక్రాంతి సెలవుల నేపథ్యంలో గత మూడు రోజులుగా నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం సందర్శకులతో నిండిపోయింది. సోమవారం కేంద్రంలోని విడిది చేసే విదేశీ విహంగాలను తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా బయట రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు విచ్చేశారు. ప్రస్తుతం పక్షుల కేంద్రంలో విహంగాలు అన్నీ పిల్లలను పొదిగి ఉన్నాయి. పిల్లల కేరింతలు, పెద్ద విహంగాలు పక్షి పిల్లలకు ఆహారం పెట్టే సన్నివేశాలు పక్షి ప్రేమికులను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. కేంద్రానికి విచ్చేసే పర్యాటకులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. చెరుకు కట్టపై వ్యూపాయింట్ల వద్ద బైనోక్యులర్లు ఏర్పాటుచేసి విహంగాల ప్రాధాన్యతను సందర్శకులకు వివరించేందుకు నేచర్ గైడ్‌ను ఏర్పాటుచేశారు.

కండలేరులో 51.730 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటి కి 51.730 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రేగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 1460, పిన్నెరు వాగుకు 50, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిస్‌కు 30, హైలెవల్ స్లూయిస్‌కు 50, క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ



శిరసనంబేడులో సిద్దేశ్వరస్వామి ఊరేగింపు



రోసనూరులో భూపతీశ్వరస్వామి..

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు, రోసనూరు గ్రామాల్లో సోమవారం సిద్దేశ్వరస్వామి, భూపతీశ్వరస్వామి గిరి ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. ఆలయాలతో పాటు ప్రధాన వీధుల్లో చలువ పందిళ్లు వేసి వీధులకు ఇరువైపులా విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు లక్షకు పైగా కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు గుంటపూడి పెంచలయ్య, శనగ రాజయ్య, నాయకులు శిరసనంబేటి చైతన్యకృష్ణారెడ్డి, వేలూరు మురళీకృష్ణారెడ్డి, ప్రసాద్ రెడ్డి, శ్యామ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, రామకృష్ణంరాజు, మోహన్, హరిబాబురెడ్డి, గోపాలయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వీర్లయ్య స్వామి గ్రామోత్సవం

మండలంలోని తాళ్వాయిపాడులో సోమవారం వీర్లయ్యస్వామి గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమారి కల్పన, నాయకులు వీరకుమార్, చంద్రయ్య, బాలసుబ్రమణ్యం, బాలయ్య, శ్రీనివాసులు, రామకృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

సామాజిక సేవే ఆయన అభిమతం

- ఎంపీ గురుమూర్తి

గూడూరు: క్రీడలను ప్రోత్సహించడంతోపాటు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం హరిచంద్రారెడ్డి అభిమతమని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి పేర్కొన్నారు. స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో సంక్రాంతి సందర్భంగా మూడు రోజులుగా కనుమూరు హరిచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మాస్టర్స్ క్రికెట్ లీగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పుట్టి పెరిగిన గూడూరు అభివృద్ధికి కనుమూరు హరిచంద్రారెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. ఈ క్రమంలోనే ఈ కార్యక్రమానికి వచ్చిన తనను కూడా పట్టణ సమీపంలోని దివిపాళెం రోడ్డు అధ్వాన్నంగా ఉందని, ఎంపీ నిధులను మంజూరు చేయాలని కోరారని చెప్పారు. త్వరలోనే నిధులు మంజూరు చేసి, రెండు నెలల్లో పనులు కూడా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ జాతీయ అధికార ప్రతినిధి కనుమూరు రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ 14 ఏళ్లుగా ఏటా సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహించడంతో గూడూరు పట్టణంలో ఎంతో అహ్లాదకర వాతావరణం నెలకొంటుందన్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ట్రస్టు వ్యవస్థాపకులు కనుమూరు హరిచంద్రారెడ్డి మాట్లాడుతూ పోటీల్లో రన్నర్స్, విన్నర్స్‌తోపాటు, బ్యాటింగ్, బౌలింగ్‌లో ప్రతిభ కనబరచిన వారికి షీల్డ్‌లను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సునీల్‌కుమార్, ఎం రవీంద్రబాబు, దేవానంద్, నాగేశ్వరరావు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ గురుమూర్తి

పోలేరమ్మ సేవలో ఎమ్మెల్యే ఆనం

వెంకటగిరి: స్థానిక పోలేరమ్మ ఆలయంలో అమ్మవారిని స్థానిక ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావుతో కలిసి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ఈఓ శ్రీనివాసులురెడ్డి ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికి, శాలువ కప్పి సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆనం ఇటీవల స్వల్ప ప్రమాదానికి గురైన స్థానిక 16వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు ధనియాల రాధమ్మను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద, మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి, జిల్లా సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ వెలికంటి రమణారెడ్డి, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనం

కబడ్డీ టోర్నమెంట్ విజేత చినతోట జట్టు

వాకాడు: మండలంలోని దుగ్గరాజపట్నంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కబడ్డీ టోర్నమెంట్ విజేతగా చినతోట జట్టు నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో వాకాడు, కోట, చిట్టమూరు మండలాల నుంచి 25 జట్లు తలపడ్డాయి. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో చినతోట, కొండూరుపాళెం జట్లు తలపడగా చినతోట జట్టు విజయం సాధించింది. రెండో స్థానంలో కొండూరుపాళెం, మూడో స్థానంలో దుగ్గరాజపట్నం నిలిచాయి. విజేతలకు ముంగమూరు శరత్ దాతృత్వంతో అందజేసిన షీల్డ్, నగదు బహుమతులను వాకాడు సొసైటీ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం నాయకుడు దువ్వూరు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న దామోదర్‌రెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ

దక్కిలి: క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని దక్కిలి ఎస్‌ఐ నాగరాజు అన్నారు. మండలకేంద్రమైన దక్కిలిలోని ఇన్‌ఫ్యాంట్‌జీసెస్ స్కూల్‌లో సోమవారం సంక్రాంతి సందర్భంగా మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ వాలీబాల్ పోటీల నిర్వహణకు కృషి చేసిన డీ వడ్డిపల్లె హైస్కూల్ హెచ్‌ఎం జగదీష్ అభినందనీయుడని కొనియాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో చదువుకుంటే భవిష్యత్ బాగుంటుందని తెలిపారు. అనంతరం నిర్వహించిన ఈ పోటీల్లో మండల వ్యాప్తంగా 19 జట్లు పాల్గొన్నాయి. విన్నర్స్ జట్టుకు రూ.12,116, రన్నర్స్ జట్టుకు రూ. 7,116 నగదు బహుమతిని అందజేస్తామని నిర్వాహకులు డీ వడ్డిపల్లె హైస్కూల్ హెచ్‌ఎం జగదీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్తంభాల గిరీశ్వరయ్యస్వామి ఆలయ చైర్మన్ నన్రావుల ప్రకాశంనాయుడు, పీహెచ్‌సీ మాజీ చైర్మన్ చెలికం భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ కే.వెంకటేశ్వర్లు, దక్కిలి హైస్కూల్ హెచ్‌ఎం సుబ్రమణ్యం, గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపల్ సుమతమ్మ పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడులు

దక్కిలి: మండలంలోని చాపలపల్లె సమీపంలో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం దక్కిలి ఎస్‌ఐ నాగరాజులు తన సిబ్బందితో కలిసి, దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి మూడు కోడి పుంజులు, రూ.1700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను వెంకటగిరి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

మర్లపూడిలో..

సైదాపురం: మండలంలోని మర్లపూడి శివారులో ఆదివారం కోడి పందేల స్థావరాలపై ఎస్‌ఐ ఉమాశంకర్ ఆధ్వర్యంలో దాడులు చేశారు.ఈ సందర్భంగా నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2140 నగదుతోపాటు రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు కొండాగుంట విద్యార్థిని



విద్యార్థిని సౌమ్యతో హెచ్‌ఎం

గూడూరు రూరల్: మండలంలోని కొండాగుంట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని సౌమ్య జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైనట్లు సోమవారం ఆ పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వరరావు తెలిపారు. పాఠశాలలో పదో తరగతి చదివే సౌమ్య ఈ నెల 11వ తేదీన విశాఖపట్నం జిల్లా అనకాపల్లెలో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ అసోసియేషన్ మీట్‌లో ప్రతిభ చూపి, జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక అయ్యిందన్నారు. అనకాపల్లెలోనే ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా సౌమ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్‌ను హెచ్‌ఎం, టీచర్లు అభినందించారు.